ఈ తాళంతో చోరీలకు కళ్లెం

- తాళం పట్టుకుంటే మోగనున్న అలారం
- అందుబాటులోకి డిజిటల్ లాక్‌లు

తవణంపల్లె: చోరీలను నియంత్రించడానికి డిజిటల్ లాక్ (తాళం) వినియోగంపై పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దొంగలు ఎక్కువగా తాళం వేసిన ఇళ్లు, ఊరికి దూరంగా ఒంటరిగా నివసిస్తున్న కుటుంబాలనే లక్ష్యంగా పెట్టుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు అరికట్టి దొంగలు పట్టుకోవడానికి సులభమైన సాంకేతికతతో కూడిన డిజిటల్ లాక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దొంగలు ఇలాంటి తాళం పగులగొటేందుకు ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగుతుంది. దీంతో ఇరుగుపొరుగు వారు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. ఇలాంటి డిజిటల్ లాక్‌లు ప్రతి ఒక్కరూ వినియోగించాలని.. దొంగతనాలు జరగకుండా కొంత వరకు నియంత్రించవచ్చని పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సూచిస్తున్నారు.




డిజిటల్ లాక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి, డిజిటల్ లాక్ అమర్చుకున్న వినియోగదారుడు

తాళం పట్టుకుంటే భారీగా శబ్దం

కుటుంబంలోని అందరూ బయటికి వెళ్లిన సమయంలో ఇంటి తలుపులు, కిటికీలు మూసి వెళతారు. ద్వారం దగ్గర గొళ్లెంకు డిజిటల్ లాక్ అమర్చాలి. లాక్‌కు లోపల బ్యాటరీ అమర్చి ఉంటుంది. కొత్త వ్యక్తులు తలుపు తీసే ప్రయత్నం చేస్తే వెంటనే అలారం మోగుతుంది. దీంతో దొంగలు భయపడి అక్కడి నుంచి పారిపోతారు. దీంతోపాటు అలారం భారీ శబ్దం వచ్చిన వెంటనే ఇరుగు పొరుగువారు అక్కడికి చేరుకుంటారు. దీని వల్ల దొంగతనాలను అరికట్టవచ్చు.

ఆన్‌లైన్‌లో డిజిటల్ లాక్‌లు లభ్యం

దొంగతనాలు అరికట్టడానికి వినియోగించే డిజిటల్ లాక్‌లు ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టిన తర్వాత ఇంటికి తెచ్చి ఇస్తారు. డిజటల్ లాక్‌లకు మంచి డిమాండ్ ఉంది. పోలీసులను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో లాక్‌లకు ఆర్డర్ పెట్టి తెప్పించి ఇస్తున్నారు.



200 డిజిటల్ లాక్‌లు పంపిణీ



మండలంలోని దొంగతనాలు నియంత్రించాలనే ప్రయత్నించడంలో భాగంగా మండలంలో 200 మందికి డిజిటల్ లాక్‌లు పంపిణీ చేశాం. డిజిటల్ లాక్‌ల ధర రూ.300 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. మండలంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఫ్యాక్టరీలకు, గృహాలకు డిజిటల్ లాక్‌లు అమర్చాం. అవసరమైన వారికి ఆన్‌లైన్‌లో బుక్ చేసి అందజేస్తాం. రూ.1000 తాళం కొంటే అలారం శబ్దం అధికంగా వస్తోంది.

– చిరంజీవి, ఎస్‌ఐ, తవణంపల్లె

ఆర్డర్ ఇచ్చాను



తవణంపల్లెలో మెయిన్ రోడ్డు పక్కనే మా టీ స్టాల్ ఉంది. రాత్రుల్లో దొంగతనాలు జరగకుండా ఉండడానికి పోలీసులు డిజిటల్ లాక్ పెట్టుకోవాలని సూచించారు. వారి సూచన మేరకు డిజిటల్ లాక్‌కు ఆర్డర్ పెట్టాను. ఇది అమర్చుకుంటే దొంగతనాలు జరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఒక వేళ దొంగతనం చేయడానికి ఎవరైనా ప్రయత్నించినా చుట్టుపక్కల వారు మేల్కొనేలా ఈ అలారం మోగుతుంది.

– వెంకటేష్, టీస్టాల్ యజమాని, తవణంపల్లె

ఈ డిజిటల్ లాక్‌లు ఎంతో అవసరం



కుటుంబసభ్యులతో ఎక్కడికైనా బయటకు వెళితే దొంగలు పసిగట్టేస్తారు. వెంటనే చేతి వాటం చూపిస్తారు. ఇలాంటి వారిని కట్టడి చేయాలంటే డిజిటల్ లాక్ పెట్టుకోవడం మంచిది. దీని వల్ల అలారం భారీ శబ్దం రావడంతో ఇంటికి చుట్టుపక్కల వారు అప్రమత్తమవుతారు. దీంతో వారిని చూసి భయంతో దొంగలు అక్కడి నుంచి పారిపోతారు. కాబట్టి అందరూ ఇళ్లకు, దుకాణాలకు డిజిటల్ లాక్‌లు వినియోగిస్తే చాలా మంచిది.

– తంగవేలు శెట్టి, తవణంపల్లె

క్లుప్తంగా

యల్లమ్మ తల్లికి భక్తితో పొంగళ్లు



పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో మంగళవారం యల్లమ్మ తల్లికి భక్తితో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. టి.పుత్తూరు గ్రామస్తులు పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి ధూపదీప నైవేద్యం సమర్పించారు. నాగాలమ్మకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు.

ఈఈకి సన్మానం



ఈఈ మునిచంద్రను సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్రను ఉద్యోగులు సన్మానించారు. డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలిసి గజమాల వేసి శాలువతో సత్కరించారు. గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ ఉద్యోగి అవార్డు, జిల్లాలో ఉత్తమ డివిజన్‌గా అవార్డులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్, కొండయ్య, శేషాద్రి, ఏఈలు, సబ్‌ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం దాత పార్థసారథి నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రసూతి వార్డులోని బాలింతలు, గర్భిణులకు దుప్పట్లు అందజేశారు. 75 మందికి దుప్పట్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

గుడిపాల: గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. మండలంలోని 197రామాపురంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి వస్తే చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి ద్వారా మిగతా పశువులకు వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి వచ్చిన పశువుల్లో పాల దిగుబడి తగ్గడంతో మేత తినవని చెప్పారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య సిబ్బందిని కలిసి చికిత్సలు చేయించుకోవాలన్నారు. అనంతరం పశువులకు డీవార్మింగ్, పిడుదుల నివారణమందు పిచికారీ చేశారు.

అంటువ్యాధుల నివారణకు జాగ్రత్తలు



బాపినాయుడుపల్లెలో మహిళలకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని బాపినాయుడుపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. బాలింతలు, గర్భవతులు, చిన్నారులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వన్ స్టాప్ సెంటర్, బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి అన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వన్‌స్టాప్ సెంటర్‌లో 08 పోస్టులు, బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పోస్టులు 03 ఖాళీగా ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు దరఖాస్తులను www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఫిబ్రవరి 10వ తేదీ లోపు సమర్పించాలని పీడీ కోరారు.

డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్ష (2024–2026) బ్యాచ్ విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని డీఈవో వరలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డీఎడ్ వన్స్ ఫెయిల్డ్ (2023–2025, 2022–2024) బ్యాచ్ విద్యార్థులు సైతం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31 లోపు, అపరాధ రుసుం రూ.50 తో ఫిబ్రవరి 4వ తేదీలోపు ఫీజులు చెల్లించాలన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులు (రెగ్యులర్) రూ.150, మూడు సబ్జెక్టులు రూ.140, రెండు సబ్జెక్టులు రూ.120, ఒక సబ్జెక్టు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌డేట్ చేసేందుకు అవకాశం కల్పించి ఉన్నారని డీఈవో తెలిపారు.

చిత్తూరు- గుడియాత్తం రోడ్డును పూర్తి చేయండి

యాదమరి (కాణిపాకం): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చిత్తూరు– గుడియాత్తం రోడ్డు పనులను మార్చి 15వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మండలంలోని చిత్తూరు–గుడియాత్తం రోడ్డును ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రోడ్డు పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టినట్లు చెప్పారు. మార్చి 15వ తేదీలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. భూమిరెడ్డిపల్లి వద్ద గ్రామస్తులు బీటీ రోడ్డు బాగా డ్యామేజ్ అయిందని దీన్ని పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. స్పందించిన ఆయన ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్‌ఎస్‌ఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, పీఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

యువతకు మెండుగా ఉపాధి

తవణంపల్లె: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మండలంలోని దిగువమాఘం లో మంగళవారం సాయంత్రం రాజన్న ఫౌండేషన్ సౌజన్యంతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, అమరరాజ బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. అమరరాజ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ అమరరాజ విద్యాలయం 8వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. రాజన్న ట్రస్టు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు రాళ్లపల్లె సతీష్, డీస్ రవికుమార్, హెచ్‌ఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ నళినీకుమార్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్, డీజీఎం ధనంజయనాయుడు, అమరరాజ విద్యాలయ ప్రిన్సిపల్ జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఆటోడ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించిందని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విమర్శించారు. చిత్తూరులో మంగళవారం ఆ యూనియన్ 9వ మహాసభలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు ఇస్తున్న వాహనమిత్రను తిరిగి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ పథకం ద్వారా సంవత్సరానికి రూ.10వేలు వచ్చేదన్నారు. వాటిని వాహన మరమ్మతులు, పన్నులు, ఇతర అవసరాలకు వాడుకునేవారని చెప్పారు. ఆ మొత్తం వారికి ఎంతగానో ఉపయోగపడేదన్నారు. చివరిగా ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడారు. నిబంధనలు, జాగ్రత్తల గురించి వారికి తెలియజేశారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయకుమార్, గోపినాథ్, దాసరిచంద్ర, రమాదేవి, ప్రభావతి, దాము, మనీ, సత్యమూర్తి, వేలన్, మోహన్, వసంతరాయులు, శేఖర్, రఘు, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించండి

గుడిపాల: రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించే విధంగా చూడాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్ అన్నారు. వసంతాపురం పంచాయతీలో మంగళవారం ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు సగటున రోజుకు ఎంత కూలి వస్తుంది అన్న విషయాన్ని తెలుసుకున్నారు. అడిగిన వారందరికీ పనులను కల్పించాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. మార్చి 31వ తేదీ నాటికి 100 రోజుల పనిని పూర్తిచేయాలన్నారు. ఇకపై పనులు చేసే కూలీలను ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) ద్వారా ప్రతి ఒక్కరినీ ఫొటోలు తీస్తామని చెప్పారు. దీని ద్వారా ఉపాధిలో అవినీతిని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుబ్రమణ్యం, టెక్నికల్ అసిస్టెంట్లు చంద్ర, సుందరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

చిత్తూరులో వేగంగా రోడ్డు విస్తరణ పనులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. దేవదాయ శాఖకు సంబంధించిన 14 నిర్మాణాలను అధికారులు మంగళవారం తొలగించారు. విస్తరణ పనులను పరిశీలించిన కమిషనర్, మాస్టర్‌ప్లాన్ ప్రకారం మార్కింగ్ పనులు పూర్తి చేసి, త్వరగా భవనాలను తొలగించాలన్నారు. ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, దేవదాయశాఖ అధికారులున్నారు.



విస్తరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పీఎంఏవై కింద రూ.2.5 లక్షలు ఉచితం

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం(పీఎంఏవై)ను ఉపయోగించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.2.5 లక్షలు ఉచితంగా ఇస్తోందన్నారు. నగరానికి 660 నూతన గృహాలు మంజూరైనట్లు తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి స్థలం ఉన్నవారు రుణం కోసం, స్థలం లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పక్కాగా కుష్టు వ్యాధి సర్వే



సర్వేలో పాల్గొన్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుష్టువ్యాధి సర్వేను పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారి సాయి షర్మిల అన్నారు. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురం, కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వేను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ సర్వే చేసి కుష్టు లక్షణాలున్న వ్యక్తులను గుర్తించాలన్నారు. అలాంటి వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి తగిన పరీక్షలు చేయాలని సూచించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయితే వెంట నే తగిన చికిత్స అందించేలా చూడాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ రవి పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గర్భిణులకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు పీహెచసీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. వెప్పాలమానుచేను గ్రామంలో మంగళవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందజేశారు. పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారికి పలు సూచనలు చేశారు. అనంతరం మోకాళ్లనొప్పులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేసి మందులు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయ, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎమ్ రుక్మిణి, గిరిజ, ఎంఎల్‌హెచ్‌పి కవిత, ఆశావర్కర్లు బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వీఎస్.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. పిల్లలకు జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. చలికాలంలో వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులు టీవీలకు దూరంగా ఉండాలి

బంగారుపాళెం: పరీక్షల సమయంలో విద్యార్థులు టీవీ వీక్షణ, స్మార్ట్ ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇరసయ్య సూచించారు. 10వ తరగతి విద్యార్థుల రాత్రి చదువులపై సోమవారం రాత్రి సీజేఎస్ఎఫ్ కాలనీ, వెలుతురు చేను, బృందావనం, పులిమడుగు, శ్రీనివాసపురం గ్రామాల్లో ఉపాధ్యాయుల బృందం నైట్ విజన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. విద్యార్థుల ప్రగతి కార్డులను గురించి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇళ్ల వద్ద వారికి ఇతర పనులు పురమాయించకుండా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠ్యాంశాన్ని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. కష్టమైన సబ్జెక్టులపై సందేహాలను గురించి ఆయా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు కష్టపడి చదవాల్సిన అవసరం ఉందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురగయ్య, బాబునాయుడు, శారద, జయంతి, రహంతుల్లా, సత్యం, భారతి, సీఆర్‌పీ విశ్వనాథం పాల్గొన్నారు.



వెలుతురు చేనులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

బంగారుపాళెం: రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నాణ్యమైన దిగుబడి సాధించేందుకు అవకాశం ఉందని చిత్తూరు వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ విజయశంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరుపల్లె, చీకూరుపల్లె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సాగుకు ముందు చేపట్టాల్సిన భూసారపరీక్షల ఆవశ్యకతను గురించి వివరించారు. విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ గురించి తెలియజేశారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పంటల ఫోటోతీసి అప్‌లోడ్ చేసిన వెంటనే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తెలియజేస్తారని చెప్పారు. రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, వీహెచ్‌ఏలు కోకిల, ఎగువమూర్తి, వీఏలు అనిల్, సాయిజ, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు లాభదాయకం

ఐరాల: యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని ఏఓ వరలక్ష్మి సూచించారు. మండలంలోని 35 యర్లంపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం లాభసాటి అని తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ప్రకృతి వ్యవసాయంతో సాధించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మానవాళికి ఆరోగ్యకరమని తెలియజేశారు. రైతులకు పొలం పిలుస్తోంది ఆవశ్యకతను వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కలూరుపల్లెలో రైతు సాగుచేసిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

ఐరాల: పశుపోషకులు ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశుసంవర్ధకశాఖ ఏడీ పద్మావతి తెలిపారు. మండలంలోని పుత్రమద్ది, మిట్టూరు గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతుల అభివృద్ధి కోసం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పశుపోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం 200 పశువులకు, దూడలకు ఏలికపాము మందులు తాగించారు. పిడుదుల నివారణ మందుల పిచికారీ, గర్భకోశ వ్యాధి చికిత్సలు, సాధారణ చికిత్సలు, చూడి నిర్ధారణ పరీక్షలు, 350 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్లపల్లె పశువైద్యాధికారి పినకాపాణి, పశువైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.



పశువుకు వైద్యపరీక్షలు చేస్తున్న ఏడీ పద్మావతి